



# నాన్నతో నడకే పెద్ద ఎడ్యుకేషన్

**- సరాగాల భరాగో**

నిత్యం సంగీత సాహిత్యాలతో సరాగ సల్లాపాలాడుతూ కన్పించే భమిడిపాటి రామగోపాలంగారు కష్టజీవి, కబుర్ల జీవి, కథల జీవి, స్నేహజీవి. ఆయన సన్నిధిలో ఉన్నవారికి కాలక్షేపానికి కొదవుండదు. రావిశాస్త్రి నివాళితో ప్రారంభించి, మొన్నటి భానుమతి 'మహామహిళ' దాకా ఎన్నో సావనీర్లు వారి ఆధ్వర్యంలో వచ్చాయి. అంతేకాక ఆపాతమధురాలైన సినిమా పాటల్ని నూట పదహార్లు, మరో నూట పదహార్లుగా తీసుకొచ్చి సంగీతాభిమానుల గుండెలు నింపారు. ఆశ్చర్యం ఏమంటే కథల పుస్తకాల కంటే ఈ నూటపదహార్లు, సావనీర్లు హాటుకేకుల్లా అమ్ముడయిపోవటం. ఈ వ్యాపార రహస్యం ఒక్క భరాగోగారికే సొంతం. భానుమతి, సాలూరి రాజేశ్వరరావుల పాటల్ని వారి స్వరాల్లో వారికే వినిపించి ఆశ్చర్యానందాలకు గురిచేసిన స్వర పరకాయ ప్రవేశ గడుసరి. తాను శ్రీరంగం గోపాలరత్నం ఇంట్లో అద్దెకుండటం అదృష్టంగా భావిస్తానంటారు.

భమిడిపాటి సూర్యనారాయణ, తెన్నేటి లక్ష్మీసూరమ్మలకు 6 ఫిబ్రవరి, 1932న జన్మించిన వీరిని ఏ కోణంలో పరిచయం చేయాలనేదే మీమాంస. ఎందుకంటే సాహిత్య సంగీతాలతో బంతాటాడుకునే భరాగోకి తెలియని ప్రక్రియ లేదు. ఏ విషయాన్నైనా అనర్గళంగా మాట్లాడగల వాక్చాతుర్యం ఆయన్ది. ఆయన కథ షష్ఠిపూర్తి చేసుకుంటున్న సందర్భం ఇది. 1991లో 'ఇట్లు మీ విధేయుడు' కథల సంపుటికి సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకుని జాతీయ స్థాయిలో తెలుగు కథకు మరింత కీర్తిని ఆపాదించి పెట్టిన భమిడిపాటి రామగోపాలంగార్ని ఈ కథా శతజయంతి సందర్భంగా ఆయన నవ్య పాఠకులకోసం ప్రత్యేకంగా చెప్పిన కొన్ని ముచ్చట్లను కూడా ఆయన మాటల్లోనే విందాం!

### మీతో కొన్ని..

చిన్ననాటినుండి ఎన్నో కష్టాలను, ఎంతో దారిద్ర్యాన్ని అనుభవిస్తూనే ఎప్పటికప్పుడు వాటిని దిగమింగుకొని, దాటుకొని జీవనరథాన్ని లాక్కొచ్చాను. ఆర్థిక మాంద్యం, కరువు, రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా ఏర్పడిన రేషనింగు మొదలైనవి తట్టుకోవల్సి వచ్చింది.

బతుకు చరమాంకంలో ఉన్న నేను వసంతాలకు పరవశిస్తూ, హేమంతాలకు తడుస్తూ, శిశిరాలకు బిగుసుకుపోతూ ... 78 ఏళ్ల ఈ బతుకు బండిని దొర్లించుకుంటూ వచ్చాను. చీకటి వెలుగుల మధ్య గడిచిన నా చదువు, ఆ తర్వాత తగిలిన ఉద్యోగం, ఆ తరువాత ఏర్పడిన సంసారం – వీటన్నిటిలో ఎన్నో కొన్ని చమత్కారాలు కూడా ఒనగూడి ఉంటాయని మీరూ ఒప్పుకుంటారు కదా. వాటిల్లోంచి కొన్ని నా బాల్య స్మృతులను ఈ సందర్భంగా మీతో పంచుకోవాలని ఉంది.

### నడుస్తూ చదువు నేర్చాను

నా చదువు ఒకటవ తరగతితో ప్రారంభం కాలేదు. అలాగని ఎల్.కే.జీ., యు.కే.జీలతో కూడా ప్రారంభం కాలేదు. అప్పుడు ఆ క్లాసులు లేవు. మా నాన్నగారికి బంధుప్రీతి ఎక్కువ. పైగా ఉపాధ్యాయ వృత్తిలో ఉండేవారు. బంధువర్గం అంతా దగ్గర ఊళ్లల్లోనే ఉండేది. అంచేత ఏమాత్రం సమయం దొరికినా ఆయన మా బంధువుల్ని పలకరించడానికి మైళ్లకు మైళ్లు నడక సాగించేవారు. అలాంటి చిన్న చిన్న ప్రయాణాల్లో నేను ఆయన్ని అనుసరిస్తూ ఉండేవాడ్ని. తోవంతా ఆయన నాకు ఇంగ్లీషు, తెలుగు, లెక్కలు, హిస్టరీ, జాగ్రఫీ, ప్రకృతి శాస్త్రం, మానవశాస్త్రం ... అన్నిటిలోనూ పాఠాలు చెప్పేవారు. నోటు బుక్కులూ కలాలూ లేవు. అలాగని పలకా బలపం కూడా లేవు. చదువంతా నోటిమాట, చెవి వినికిడి. ఇవికాక అమ్మ చెప్పేది కొంత. ఇది శతకాలకూ, ఎక్కాలకూ పరిమితం.

కాస్త పెద్దయ్యాక మా పెదనాన్న గారింట్లో (1942-44) ఉన్నప్పుడు 'కోడుగుడ్డు లాంపు' అని చెప్పుకునే చిన్న కిరసనాయిలు దీపం ఉండేది. కిరసనాయిలుకు కరువు వచ్చినప్పుడు రోడ్డు మీదికి చేరి పక్క ఇంటి మెట్ల మీదికి కాంతి చిమ్మే మున్సిపల్ కరెంటు దీపం కిందకి చేరి చదువుకునే వాడ్ని. అయితే రెండవ ప్రపంచ యుద్ధ కారణంగా ఆకాశంలో ఎగిరే శత్రుసేనకు ఈ నగరాల అనుపానులు కనవడకుండా ఉండాలని 'బ్లాక్ ఔట్' పద్ధతి పెట్టారు. నల్లరంగు రేకుతో తయారు చేసిన గుండ్రపాటి గొట్టాలను బల్బుకి చుట్టూరా వచ్చేటట్లు ఏర్పాటు చేసేరు. ఇందువల్ల సరిగ్గా లైటు కింద కూర్చుంటేనే అక్షరాలు కనపడేవి. అక్కడ కూర్చోడానికి పిల్లలమంతా పోటీ పడాల్సివచ్చేది.

### వారాలబ్బాయిని

మా స్కూల్లో చదువుతుండగా అనుకోని పరిస్థితుల వల్ల వారాలు చేసేవాడ్ని. ఆ సందర్భంలో నాకిప్పటికీ గుర్తున్న సంఘటన శ్రీవైష్ణవులింట జరిగినది. మేము స్మార్తులం. వారు వండుకునేప్పుడు మమ్మల్ని చూడనివ్వరు. వారు భోజనాలు చేసేప్పుడు కూడా మేం చూడకూడదు. అంచేత నా భోజనం నట్టింట్లో కాకుండా ఆ ఇంటి వీధి అరుగుమీద పెట్టేవారు. నాకపుడు ఎనిమిదేళ్ల వయసే. నేను భోజనం చేస్తుండగా నా ముందు నుండి వెళ్తున్న ఒక గేదె సరిగ్గా ఆ అరుగు పక్కని నిలబడి తీరుబాటుగా మల మూత్ర విసర్జన చేసి వెళ్లింది. నాకు కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. వెంటనే విస్తరి మడిచి చుట్ట చుట్టి పారెయ్యడానికి లేచాను. సరిగ్గా అదే సమయంలో ఆ ఇంటి ఇల్లాలు నా భోజనంలో వడ్డించడానికి మజ్జిగ, ఆవకాయ తీసుకొచ్చింది. ఆ సన్నివేశాన్ని చూసిన ఆమె వెళ్లి ఆచార్లుతో ఏదో మాట్లాడసాగింది. నేను మాత్రం విస్తరాకుని పెంటకుప్పలో పారేసి భోజనం చేసిన చోట ఎంగిలిని శుభ్రం చేసి పక్కగా కూర్చున్నాను. ''రా నాయనా, లోపల వరండాలో మజ్జిగన్నం పెడతాను'' అని పిలిచారావిడ. మా ఆర్థికస్థితి తలచుకొని ఏడుపే వచ్చింది గాని ఆకలి వేయలేదు. ''భోజనం సగంలో మానేసి, లేచిపోతే పరబ్రహ్మకు ఆగ్రహం వస్తుంది'' అని ఆవిడ చెప్పినా మళ్లీ తినడానికి నా మనసు అంగీకరించలేదు.

### దేశం కోసం పూట భోజనం త్యాగం చేశాను

1942 ఆగస్టు 9, క్విట్ ఇండియా నినాద దినం. విద్యార్థులమంతా స్కూళ్లు ఎగ్గొట్టి రోడ్లు పట్టాము. ''చిన్నపిల్లలు మీకేం తెలీదు. మీరు ఈ గోలలో తిరిగి దెబ్బలు తినకండి'' అని మేస్టార్లు చెప్పినా 10 -13 వయసున్న వాళ్లు కూడా 'వెళ్లిపో! తెల్లవాడా వెళ్లిపో! మా దేశం మాకిమ్మని ఆదేశం తీసుకో!' అంటూ పాటలు పాడుతూ కస్పా మూడులాంతర్ల జంక్షన్ నుంచి గంటస్తంభం వేపు సాగేం. అప్పుడే పోలీసులు మమ్మల్ని అడ్డుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కి లాక్కెళ్లారు. అక్కడ అప్పటికే ఎందరో జనం. జైలు కొట్లన్నీ కిటకిట లాడిపోతున్నాయి. లోపలికెళ్లడానికి చోటు లేదు. బైట పడ్డానికి అనుమతి లేదు. ఏదో ఆవేశం. మరెంతో ఆందోళన. దేనికి అర్థం,




ప్రయోజనం తెలీవు. ఇక వోపికల్లేక ఎక్కడివాళ్లం అక్కడే చతికిలబడిపోయాం. ఆ పూట భోజనం లేదు. సత్రంలో రెండో బాచ్ టైం కూడా దాటిపోయింది. (కనుక దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నేను చేసిన 'త్యాగం' ఒక పూట భోజనం మాత్రమే!)

### నా కథల నేపథ్యం

6వ తరగతిలో చేరినప్పటికి నా వయసు ఎనిమిదేళ్లు. అప్పటికే నేను శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'ఇల్లు పట్టిన వెధవాడబడుచు', భమిడిపాటి కామేశ్వరరావు 'బలరామయ్యగారి ఇంగ్లీషు తమ్ముడు', చింతా దీక్షితులు 'సూరీ, సీతీ, వెంకీ', పాలంకి వెంకటరామచంద్రమూర్తి 'ఎప్పుడు వచ్చినా' అనే కథలు చదివాను. వాటిల్లో నాకు బోధపడినవి వరదరావు హోటల్లో ఇడ్లీ రుచులు, సంతర్పణలలో మొహమాటపడుతూ బూరెలు వడ్డించుకు తినడం, చెట్ల నుండి రాలిన పండ్ల రుచి, అనుకోకుండా తగిలిన తద్దినం భోజనపు పుష్టి – ఇలాంటివే. తిండి దొరకని రోజులలో చదవడం వల్ల ఆ కథ

లలో తిండి సంగతులే నాలో బాగా నాటుకుని ఉండిపోయాయి. (బాల్య చాపల్యా లలో తిండి చాపల్యం చాలా ముఖ్యమైనదేమో?)

అంతేకాని ఆ కథలలో 'వస్తువు'ను 'శిల్పాన్ని' గ్రహించుకున్న ముచ్చట కానే కాదని అనుకుంటాను. వస్తువుకోసం ఆ రోజులలోనే చదివిన కథలు చిత్రగుప్త, వినోదిని, ఆనందవాణి మొదలైన పత్రికల్లోవి తేలికపాటి సాహిత్యమే.

ఫలానా కథ ఫలానా రచయిత ఎందుకు రాశాడు, ఎలా రాశాడు అనే జిజ్ఞాసలతో చదవడం 1943 నుండి ప్రారంభమయింది. మా యింటికి రాని (తెప్పించుకోవడానికి ఆర్థిక స్థోమతలేని) మాసపత్రికలు మొదలైనవి. విజయనగరం కస్పాలో ఉండిన 'కస్తూరిబా స్మారక పఠన మందిరం'లోనూ కన్యకాపరమేశ్వరీ ఆలయం వెనుకభాగాన ఉండిన ఆర్యవైశ్య గ్రంథాలయంలోనూ చదువుకున్నాను.

ఈ కథా పఠనం ఒక అధ్యాయంగా మారినది. నా కాలేజీ రోజుల్లో విజయనగరం మహారాజా కాలేజీ లైబ్రరీ నాకు 18, 19, 20 శతాబ్దాల తొలిసగం ఇంగ్లీషు, ఫ్రెంచి సృజనాత్మక రచయితలను ఎందరెందరినో పరిచయం చేసింది. శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి గారి చిన్నతనంలో సంస్కృతం చదవడమే (తెలుగు చదవడం కన్నా) గౌరవప్రదం. మా తరం వారికి ఇంగ్లీషు చదవడమే గౌరవప్రదం. చదివేసి ఊరుకోక ఆ బాణీ వ్రాత కొంతవరకైనా మనకి పట్టుబడకపోతుందా అనే పట్టుదల మాలో కొంతమందికి ఉండేది. ఆ పట్టుదలకి రోణంకి అప్పలస్వామిగారు, కొత్తపల్లి వీరభద్రరావుగారు మొదలైన గురువుగార్లది; చాగంటి సోమయాజులుగారు, నిడదవోలు లింగమూర్తిగారు మొదలైన శ్రేయోభిలాషులది, ప్రోత్సాహం తోడై మాలోంచి కొందరు రచయితలు ప్రభవించేటట్లు చేసింది.



మాలో కొందరు కేవలం వస్తువుకోసం తాత్కాలిక ఆనందం కోసం చలం, కొవ్వలి, జంపన, మానాపురం, భరద్వాజ, ధనికొండ, కుటుంబరావు, చాముండేశ్వరి దేవి, శారద మొదలైనవారి రచనలు చదువుతూ నూనూగు మీసాల నూత్న యౌవన దినాలను కులాసాగా గడిపినవారు కూడా ఉన్నారు.

నా రచనల మీద తొలిదశలో విశ్వనాథ సత్యనారాయణ, శరత్‌బాబు గార్ల ప్రభావం ఉండేది. తరువాతి కాలంలో రాచకొండ విశ్వనాథశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, ముళ్ళపూడి వెంకటరమణ గార్ల అనుకరణ ఉండేది. రాను రాను నేను చిన్ననాడు చదివిన అస్కార్ వైల్డ్, సోమర్‌సెట్‌మామ్, ఆల్డస్ హక్స్‌లే, డి.హెచ్. లారెన్స్ వంటి పాశ్చాత్య రచయితల ప్రభావం నా మీద గట్టిగా పడింది. వాళ్ల శైలిలో తార్కికత, వస్తువులలో సరదా ధోరణి, వాక్య నిర్మాణంలో గడుసుతనం ఇది నాకు పట్టుబడాలని ప్రయత్నం చేసినట్టు నాకు తోస్తుంది. (వీటన్నిటిని కలిపి తెలుగుతో ప్రసాదగుణం అంటారేమో)

నాకు ఇద్దరు జ్యోతిష్కులు నా ప్రమేయం లేకుండానే తగిలారు. అందులో ఒకరు నాకు రచనా ప్రతిభ చాలానే ఉంటుందని (నా రచనలేవీ చదవకుండానే) చెబుతూ దానిని నా అదృష్టం ఎప్పటికప్పుడు కాపాడుకు వస్తుందని కూడా చెప్పాడు. అందువల్లనే కాబోలు నేను కథలు రాయడం మానేసినా నా పేరూ నా కథల్లో కొన్నిటి పేర్లూ చాలామందికి ఇంకా జ్ఞాపకం ఉన్నాయి.

## నచ్చినవి

| | | |
|---|---|---|
| సినిమాలు | : | భానుమతి 'మల్లీశ్వరి, కత్రినాకైఫ్ 'మల్లీశ్వరి, నాగార్జున 'మన్మథుడు'. |
| నటీమణులు | : | సూర్యకాంతం, నిర్మలమ్మ. |
| నటులు | : | ఎస్వీరంగారావు, గుమ్మడి, తనికెళ్ల భరణి. |
| నవలలు | : | బుచ్చిబాబు 'చివరకు మిగిలేది', డా.పి.శ్రీదేవి 'కాలాతీత వ్యక్తులు'. |
| కథలు | : | గురజాడ 'సంస్కర్త హృదయం', మధురాంతకం రాజారాం 'పొద్దువాలని మనిషి'. |
| గాయకులు | : | ఘంటసాల, సైగల్, రఫీ. |
| గాయనులు | : | రావుబాలసరస్వతి, చిత్ర. |
| బెస్ట్‌ఫ్రెండ్స్ | : | టెలిఫోన్, నిఘంటువులు, అట్లాస్. |
| నా మొదటికథ | : | నేను - మా ఆవిడ (11.2.1949) |
| నా చివరికథ (ఇప్పటికి) | : | సాయంసంధ్య(11.3.2009) |

### ఇది నా స్వయం ఖుషీ

పుస్తకాలు రాసేసీ చదివేసీ స్వయం ఖుషీలో పడడం కన్నా గ్రంథాలయం స్థాపించి పదిమంది చేతా చదివించడం మంచిది. అందుచేత నాకు కారా మాష్టారంటే యిష్టం. నేనొక కథారచయితనన్న సంగతి తెలుగు పాఠకులూ తెలుగు కథా సంకలనాల కర్తలూ మరిచిపోయి ఒక దశాబ్దానికి పైగా కాలం గడిచిపోయిందన్న చింత నాకు బాధాకరంగా లేదు. ఎందుకంటే నాకంటే సీనియర్లవీ జూనియర్లవీ కథల పుస్తకాలను ప్రమరించీ ప్రాచుర్యానికి తెచ్చీ నేను తృప్తి పడ్డాను. కల్పనా సాహిత్యపు ఉత్పత్తిని కొంత ఆపి అనుష్ఠాన భగవద్గీత(ఇంగ్లీషు నుండి తెలుగు) కల్పసూత్రమ్ (ప్రాకృతం నుండి తెలుగుకి) అనువాదాలు చేసేను. సంగీత, సాహిత్య సినిమారంగాలలో ప్రముఖుల మీద, ప్రసిద్ధుల మీద, పదిహేను సావనీర్లు తయారుచేసేను. (ఏవీ కూడా ఇప్పుడు స్టాకులో లేవు) నూటపదహారు గొప్ప తెలుగు సినిమాపాటలు – అనే పేర 2001లో నేను రచించిన పుస్తకం స్ఫూర్తిగానే సినిమా ప్రముఖులని గురించీ, పాటలను గురించీ ఈ తొమ్మిదేళ్లలో సుమారు 30 పుస్తకాలు వెలువడ్డాయనీ, "స్టిల్ ఫోటోలు చేరి వచ్చే సినీరంగ గ్రంథాలే బాగా రాణిస్తాయని" నేను తీసిన దారిని ఆయా పుస్తకాలు రాసినవారూ, సంపాదకులూ నమ్మేరని అనుకున్నవాళ్లూ చెప్పినవాళ్లూ వేల సంఖ్యలో ఉన్నారని నాకు తెలుసు. ఇలాంటి పరిస్థితుల్లో సరికొత్త ట్రెండ్సులో కథలు రాయలేకపోయాను గాని అది నాకు గాని, నాకంటూ ఏర్పడిన పాఠకులకు గాని అసంతృప్తి కలిగించలేదని నేను తెలుసుకున్నాను.

– గొరుసు జగదీశ్వరరెడ్డి

**నాకు నచ్చిన నా కథ**

# ముద్ర

భమిడిపాటి రామగోపాలం

ఎనిమిదేళ్ళ కిందట ఒకనాడు ఉదయం మా ఇంటి కాలింగ్‌బెల్ మోగితే నేనే వెళ్ళి తలుపుతీస్తే; చక్కగా డ్రెస్ చేసుకుని మొహంలో కాంతి పోసుకున్న ఓ పద్దెనిమిదేళ్ళ కుర్రాడు నిలబడి ఉన్నాడు; అక్కడ. నేను తలుపు తీసీ తియ్యగానే ‘‘నా పేరు వెంకటాచలమండి. చినవాల్తేరు నుండొచ్చాను. మీ బట్టలు ఉతికే నారాయణ మా పాధరండి’’ అని గడగడా చెప్పేడు.

‘‘ఓహో, నువ్వా? చదువుకుంటున్నావుట కదు?’’ అన్నాను, దయగా.

‘‘అవునండి. తొమ్మిదో క్లాసండి’’.

‘‘రా; లోపలికి రా; అక్కడే నించుండి పోయేవేంటి?’’ అని ఆ అబ్బాయి అంతసేపటి దాకా లోపలికి రాకుండా నేనే అడ్డుగా వున్నానన్న సంగతి దాటవేసి దారి ఇచ్చేను.



"అది కాదండి, మా నాన్నగారికి రాత్రి నుండి ఒంట్లో బాగలేదండి; ఒకటే జ్వరం. మీరు ఈ రోజు కాంపెల్తారని, మీ బట్టలు ఉండిపోయాయనీ చాలా బాధ పడి పోతున్నారండి. అంచేతండి–"

"అంచేత; నువ్వుగాని ఆ బట్టలు తీసుకు బయల్దేరేసీ వేమిటి?" అన్నాను మరింత దయగా.

"మరేండి, మీ క్యాంపుట్టైం దాటిపోకుండా మీ బట్టలు మీ కందించేస్తే మీకూ, మా నాన్నగారికీ కూడా హాపీగా ఉంటాదని..." మంచిపని చేస్తూనే ఏదో పశ్చాత్తాప ధోరణిలో అన్నాడు వెంకటాచలం.

"మరి, ఏవీ బట్టలు?"

"కిందను సైకిలు స్టాండు కున్నాయండి. మీ ఇల్లూ, పేరూ సరిగా తెలుసుకోకుండా మేడమీదికి తెచ్చీడం ఎందుకని కిందనే ఉంచేశాను సార్. ఒక్క నిముషం!" అని చకచకా మేడమెట్లు దిగి వెళ్ళి ఒక్క నిమిషంలోనే బట్టలు పట్టుకొచ్చేడు.

చాకలి నారాయణ కొడుకు వెంకటాచలం ఆ విధంగా పరిచయం అయ్యేడు, నాకు! ఆ కుర్రాడి వేషం భాషా నాకు బాగా నచ్చేయి. పదిమంది మర్యాదస్తుల కుటుంబాల వాళ్ళ బట్టలు ఉతికే చాకలి కొడుకు కనక ఆ అబ్బాయి మంచి మంచి బట్టలు వేసుకోడంలో వింత ఏమీలేదని సరిపెట్టుకున్నా అతని మాటలో యాస లేకపోడం, ఆ "మంచీ, మర్యాద" వంశపారం పర్యంగా వచ్చినవి కాదని, వాడి సొంత సంస్కారమే అనీ స్వయంకృషేననీ తెలిసి పోతోంది కదా.

నా బట్టలు మాత్రం తెచ్చేడు. "మిగతావి అంత అర్జంటు కాదన్నారండి మా నాన్నగారు" అని లెక్క ప్రకారం అప్పగించి; వెంటనే వెళ్ళిపోలేదు, వెంకటాచలం. మా అమ్మాయి అక్కడొక కుర్చీలో కూచుని, ఎదురుగుండా టీపాయి మీద పరుచుకుని తదేకంగా చూస్తున్న రీడర్స్ డైజెస్టు సంస్థ వారి గ్రేట్ వరల్డ్ అట్లాస్ మీద పడ్డట్టుంది వాడి దృష్టి. ఆ రోజుల్లో మూడు వందల రూపాయల ఖరీదుండే ఆ అట్లాసు వాడికి అందుబాటులో ఉండదన్నది నిస్సంశయం. అందుచేత వాడు వీలైనంత సేపూ ఆ అట్లాసులోకి మా అమ్మాయి చూస్తున్నంత సేపూ చూసేస్తాడన్నది ఖాయం. తనంతట తాను "ఆ పేజీ తియ్యండి, ఈ పేజీ తిప్పండి" అని అడక్కపోయినా; వాడు మా అమ్మాయితో సమానంగా ఆ అట్లాసులోకి తొంగిచూడ్డం మా అమ్మాయికి ఎంబరాసింగ్‌గా ఉంటుందేమో అని, అనుమానించిన నేను వాణ్ణి ఆ విషయంలో నిరుత్సాహపరచాలని నిశ్చ యించుకున్నాను. కాని, డయిరెక్ట్‌గా "అలాంటి ఖరీదైన అట్లాసుల్లో నీతల దూర్చకురా, ఒరే చాకలి కుర్రాడా!" అని చెప్పేడానికి నా సంస్కారం కూడా అడ్డు తగిలింది. అందుచేత నేను గుప్ చిప్‌గా లోపలికెళ్ళి, ఓ ముప్పయి రూపాయలు తెచ్చి వెంకటాచలం మొహం మీద రెండు చిటికెలు వేసేను. వాడు తలెత్తి నావేపు చూసేడు.

"మీ నాన్నకి ఒంట్లో బావులేదంటున్నావు కదా. మందులికీ వాటికీ అవసరం వొస్తుంది. ఈ ముప్పయి రూపాయలూ పట్టుకెళ్ళు. తరవాత లెక్క చూసుకుందాం" అన్నాను.

వెంకటాచలం డబ్బు అందుకుని "థాంక్స్, సర్" అనేసి డబ్బు ముప్పయి రూపాయలూ ఉన్నాయా అని లెక్కయినా పెట్టుకోకుండా జేబులో పెట్టేసుకుని మళ్ళా అట్లాసులోకి చూడ్డంతో, మా అమ్మాయి ఆ పుస్తకాన్ని రఫీమని పెద్దచప్పుడు చేస్తూ మూసేసి స్ప్రింగ్ తన్నినట్టు స్పీడుగా నిలబడింది. వెంకటాచలం నాతో; "సార్; ఆ అట్లాసు ఒక్కసారి తిరగేసి చూడొచ్చునా, సార్?" అన్నాడు.

మా అమ్మాయి; (ఎంతైనా నా బిడ్డ కదా) గొప్ప పేట్రనైజింగ్ టోన్‌లో, "ఓ, ష్యూర్!" అని పర్మిషన్ ఇచ్చేసి అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

వెంకటాచలం నిర్భయంగా మా అమ్మాయి ఖాళీ చేసిన కుర్చీలో కూర్చుని అట్లాస్ తిరగెయ్యడం మొదలు పెట్టేడు.

మన దగ్గర కూలి డబ్బులు తీసుకుని మనకి చాకిరీచేసే పని వాళ్ళ కొడుకులో కూతుళ్ళో మన పిల్లలు చదివే పుస్తకాలు స్వతంత్రంగా చదివేస్తేనూ; మన పిల్లలు ఉపయోగించే ఫర్నిచరూ, వెహికల్సు చనువుగా ఉపయోగించేస్తేనూ మనం సహించం. కాని గబుక్కున ఏదైనా అనడానికి కూడా నాకు నోరు రాలేదు. అలాగని వెంకటాచలాన్ని ఏదో రకంగా చిన్నచూపు చూడాలని, ఆ సంగతి వాడికి బోధపడేటట్టుగా ఆ ఉద్యమం సాగాలని నాలో రేగిన కోరిక చావలేదు. అందుకనే కాబోలు; నేను ఇంకో కుర్చీలో కూర్చుని సంభాషణ మొదలెట్టాను.

"ఎంత చదువుతున్నావు నువ్వు, తొమ్మిదా?"

"ఊఁ".

"ఇది నీ స్థాయికి అందదు. స్కాలర్లీ ఎడిషను".

"ఊఁ"

"అంతగా నీకు అట్లాస్ సరదా ఉంటే ఈ సారెప్పుడైనా ఒక సెలవు రోజుని రా, ఆక్స్‌ఫర్డ్ వాళ్ళు వేసింది స్కూల్ అట్లాస్ అని ఉంది. అది నీకు ఇచ్చేస్తాను. ఈ అట్లాస్ కొన్నాక మా పిల్లలు దాని మొహం చూడ్డం మానేసేరు".

"అది నా దగ్గరుంది సార్" అన్నాడు వెంకటాచలం నా వేపు చూడకుండానే.

పనివాళ్ళో, వాళ్ల పిల్లలో మన ప్రిమిసిస్‌లో ఉన్నప్పుడు వాళ్ళు అటూ ఇటూ చూసి ఏదో చిన్న వస్తువు జేబులోనే బొడ్లోనో దోపేసుకుని చల్లగా జారుకోకుండా కాపలాకాసే సంస్కృతి నాలో కూడా ఉండడం వల్ల కాకపోయినా, నేను నా సరదా కోసం నా పిల్లల వికాసం కోసం మూడు వందల రూపాయలు పోసి కొనుక్కున్న ఆ అట్లాస్ గురించి, లేదా అందులో ఉన్న గొప్ప విశేషాలను గురించి వెంకటాచలం మెప్పుగా ఏదైనా అంటే (నైబర్స్ ఎన్వీ, ఓనర్స్ ప్రైడ్) స్వీకరించడం కోసం మరింతసేపు నేను అక్కడే కూర్చున్నాను. కాని వెంకటాచలం తన ఆనందాన్ని గాని విభ్రమనుగాని నాతో పంచుకోక పోయే సరికి నాకు బోరుకొట్టి; "సర్లే, నువ్వు వెళ్ళేటప్పుడు ఈ తలుపు దగ్గరిగా వేసి వెళ్ళు. మీ నాన్నకి శ్రద్ధగా వైద్యం మాత్రం చేయించు" అని చెప్పేసి లేచాను.

మా కుర్రాళ్ళు చదివి వదిలేసిన పుస్తకాలు గాని, వాళ్ళకి పొట్టిగానో ఔటాఫ్ ఫేషన్‌గానో, అనిపించే బట్టలు గాని అడుక్కోడానికి వెంకటాచలం మా ఇంటికి అంతకి ముందుగాని ఆ తరువాత గాని ఎప్పుడూ రాలేదు. వెంకటాచలం మా



ఇంటికి రెండోసారి (నాలుగేళ్ళ కిందట) రావడం ఎలా జరిగిందంటేను.

విశాఖపట్నంలో భారత నౌకాదళానికి చెందిన ''పూర్వ ముఖ్యాలయ'' (ఈస్టర్న్ నేవల్ కమాండ్) ఉంది కదా. ఆ సంస్థలో బాచిలర్ సెయిలర్స్ (అనగా అవివాహిత నావికుల) కోసం హాస్టల్స్ లాంటివి కూడా ఉన్నాయి. ఎక్కడెక్కడి నుంచో నౌకల్లో నావికులూ, ఇక్కడ శిక్షణ పొందే వాళ్ళూ ఆ హాస్టల్సులో టెంపరరీగా కొందరు, పర్మనెంటుగా కొందరు ఉంటారు. ''సత్రా: భోజనా, మఠాం నిద్రా'' రకం ఉద్యోగులు, వాళ్ళు. అయితే మనిషికి భోజనం నిద్రాకాక వేషం కూడా అవసరం కదా. ఈ ''నావికులు'' తమ దుస్తులు, దుప్పట్లు ఉతికించుకోడానికి ఊళ్ళో చాకళ్ళని పెట్టుకోనక్కర్లేకుండా (దానికోసం సమయం వృథా చెయ్యక్కర్లేకుండా) కేంపస్‌లో దోబీలు, దోబీ ఘాట్‌లు ప్రభుత్వ నియామక నిర్మాణాల వల్ల అమరి ఉంటాయి. ఆ కారణంగా నాలుగేళ్ళ కిందట రెండు 'దోబీ'' ఉద్యోగాలు ఖాళీ పడ్డాయి. అప్పటికి వెంకటాచలం ఇంటర్ రెండో ఏడాది చదువు పూర్తిచేసి ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలో తన పేరు రిజిస్టర్ చేసుకున్నందువల్ల సహజంగా ఇతనికి ఆ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళమని కాగితం వచ్చింది . వెంకటాచలం-ఆ ఉద్యోగం నేను చెయ్యను; అందుచేత ఆ ఇంటర్వ్యూకే వెళ్ళను, అని మొరాయించేడట; నారాయణ నా దగ్గిర కొచ్చి మొరపెట్టుకొని ''ఆడికి తమరంటే గౌరవం బాబూ. తమరోసారి సెప్పి వొప్పించరా?'' అని వాడి ధోరణిలో (కాళ్ళా వేళ్ళా పడి) నన్ను అడిగేడు, ''సరే, ఏదో సాకు పెట్టి మీ కుర్రాణ్ణి నా దగ్గరికి పంపించు'' అన్నాను. ఈసారి నారాయణ నా బట్టలు కొన్ని వుతికి ఇస్త్రీ చేసి, తను అర్జంటుగా ఏదో ఊరెళ్తున్నాననీ, ఈ బట్టలు వెంకటాచలమే మా ఇంటికి అందచెయ్యాలనీ చెప్పి తన పాత్ర తను సమర్థవంతంగా నిర్వహించేడు.

''ఇంటర్ పాసయ్యేవు కదా, డిగ్రీ చదువుతావా, లేకపోతే ఏదైనా ఉద్యోగానికి వెళతావా? నీకూ ఇరవై ఏళ్ళు దాటేయికదా, మీ నాన్నకి చేతికి అందుకొస్తావని అడుగుతున్నాను!'' అని ప్రారం భించాను, సంభాషణ.

''ఉద్యోగం దొరికితే చేస్తానండి'' అన్నాడు వెంకటాచలం.

''ఇహనేం మరీ! ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజికి వెళ్ళి నీ పేరు రిజిస్టర్ చేయించుకో. గురునాథరావు గారని, అక్కడ పనిచేసే ఆఫీసర్ ఒకాయన నాకు తెలుసు. ఏదైనా ఉద్యోగానికి కాల్ లెటర్ వచ్చేటట్టుగా నేను చూస్తాను''.

''రిజిస్టర్ చేశానూ, కాల్ లెటర్ వచ్చింది కూడానండి. ఐతే ఆ జాబ్ నాకిష్టం లేదు సార్. ఫ్యూన్ పనైనా చేస్తాను గానండీ, దోబీ పని మాత్రం చెయ్యనండి'' అన్నాడు వెంకటాచలం.

వివరాలేవీ నాకు తెలియనట్టు నటించి సంగతంతా వెంకటాచలం నోటంటే రాబేట్టను. ''దోబీ అయితేనేం వోయ్! నెలకి పన్నెండు వందల రూపాయల జీతం ఇస్తారు కదా, పైగా ఈ పని అయితే నేర్చుకోడం తప్పులు చెయ్యడం ఉండవు నీకు. మాట పడకుండా అవలీలగా పని చేసే గలవు. నన్నడిగితే ఇందులో చేరిపోడమే బెస్టు'' అన్నాను.

''చదువుకున్న వాడికంటే చాకలాడు మేలని మీరేదో పాత సామెత చెప్తే చెపొచ్చుగానండి, నేను ఆ పని కూలికిగానీ జీతానికి గానీ చెయ్యదల్చుకో లేదండి'' అని ఒక్క క్షణం ఆగేడు, వెంకటాచలం.

''అదేం అలాగ? కులవృత్తిలో అవమాన పడవల్సిందేం ఉండకూడదే?'' అన్నాను.

వెంకటాచలం సన్నగా నవ్వేడు. ''మీరేమీ అనుకోనంటే ఒక ఇన్సిడెంట్ చెప్తానండి'' అన్నాడు.

''చెప్పు, చెప్పు!'' అన్నాను. వాడు కొంచెం ఉషారులో పడితే నేను పాఠం చెప్పడం సుళువయి పోతుందన్న ధీమాతో.

''చెప్పు చెప్పు అన్నారు కదండి సార్. ఇది చెప్పుకు సంబంధించిన సంగతేనండి. మా వీధిలో వెంకటేశ్వర శర్మ గారని ఒకాయన ఉన్నారండి. సేల్స్‌టాక్సీఫీసులో క్లర్కండి. ఆయన మీద ఏదో ఫిర్యాదొస్తే సస్పెన్షన్‌లో పెట్టేరండి. ఎన్క్వయిరీలో శర్మగారికి ఫేవర్‌గా కొన్ని సాక్ష్యాలొచ్చేయండి. అంచేత ఓసారి ఆఫీసర్ గారితో స్వయంగా మనవి చేసుకుందామని శర్మగారు ఆయనింటికి వెళ్లేరండి. వీధి తలుపు గడియ పెట్టుంటేను, తలుపు ఎన్నిసార్లు పిల్చినా యెవరు రాలేదెందుకని తలుపు సందులోంచి చూసేడంటండి. సరిగ్గా సమయానికి ఆఫీసర్ గారు లోపలి వరండాలో తన చెప్పు తెగిపోతే రిపేరు చేసుకుంటూ కనబడ్డారటండి. ఇంతలోకి ఆఫీసర్‌గార్ని చూడ్డానికి సిటీ ఎంపోరియం ప్రొప్రయిటర్ నీలకంఠంగారొచ్చి; ''ఏంటయ్యా, అయ్యగారేం చేస్తున్నారు?' అని శర్మగార్ని పలకరించేరటండి. నీలకంఠం గారికీ శర్మగారికీ బాగా దోస్తీ కదండి; అందుకని శర్మ గారేమో, అయ్యగారు కులవృత్తి చేసుకుంటున్నారని జోకేస్తే యిద్దరూ నువ్వుకున్నారటండి. ఆ తరవాత మరేంటైందో, ఓబయ్యగారు మర్నాడు శర్మగార్ని పిల్చి, 'సారీ పంతులు గారూ, మీ కేసులో నేను మీకేమీ ఉపకారం చెయ్యలేక పోయానండి. మీరింక కులవృత్తి చేసుకోవలసిందేనండి' అని చెప్పేసి ఉద్యోగం తీసేసిన ఆర్డర్ చేతికిచ్చేశారటండి''.

'ఓరి గుండెలు తీసిన బంటూ, ఎంత మాట అన్నావురా!' అనుకుని నిర్ఘాంతపోయాను నేను, ఆ వెంకటేశ్వర 'శర్మ' తరఫున.

''నేను పదోక్లాసు చదువుతున్నప్పుడే నిర్ణయించుకున్నానండి దోబీ పని చెయ్యకూడదని ఓ రోజు సోషల్ మేష్టారు ఒక పాఠం బోధ పరచడానికండి; గుడ్డ మీద

## కథాంతరంగం



విశాఖపట్నం పోర్టు ట్రస్టులో ఎస్టేటు సెక్షన్‌లో రజకుడయిన ఒక నాలుగో తరగతి ఉద్యోగి ఉండేవాడు. అతడు ఎప్పుడూ ఇస్త్రీ చేసిన బట్టలతోనే ఆఫీసుకు వచ్చేవాడు. అతన్ని చూస్తే కొందరికి ముచ్చట, కొందరికి అసూయ; అతను రజకుడు కనుకనే ఎవరెవరివో గుడ్డలు రోజుకొకటిగా మార్చి తొడుక్కొస్తున్నాడని తెలిసిపోయింది.

ఒకానొక చేర్మన్‌గారు ఎస్టేటు మేనేజరుతో ''మా బంగళాలో బట్టలు ఉతికి, ఆరవేసి, ఇస్త్రీ చేసే పనికోసం ఎవరైనా కుర్రాణ్ని చూసి పెట్టండి. నెలకు రూ.500 జీతం ఇస్తాను'' అన్నాడు.

ఎస్టేటు మేనేజర్ గారికి తలలో ఒక గొప్ప దీపం వెలిగింది. ''మీరు జీతం ఇవ్వడమేమిటి సార్. నా సెక్షన్‌లో ఒక అద్భుతమైన రజకుడైన కుర్రాడు క్లాస్‌ఫోర్ ఉద్యోగంలో ఉన్నాడు. అతన్ని బంగళా ఎకౌంటుకి ట్రాన్స్‌ఫర్ చేయించేసి అతను ఆ పనిమీదే ఉండేటట్లు చేస్తాను'' అని చెప్పి వారం రోజుల్లో పని సాధించాడు.

ఈ కళాసీకి రెండు మూడు రకాల సదుపాయాలు వచ్చాయి. 1. చేర్మన్‌గారి బంగళాకి, అతని ఇంటికి నడకతో తీరిపోయేటంత దూరం మాత్రమే. 2. ఉదయం ఏడున్నరకి డ్యూటీ ఎక్కితే పది గంటలకి మొత్తం బట్టలన్నీ ఉతకడం అయిపోయేది. ఇంటికి వెళ్లి సాయంకాలం నాలుగులోగా వచ్చి ఇస్త్రీ మొదలుపెడితే ఆరు గంటల్లోగా డ్యూటీ సరి.

ఇలా ఉండగా పోర్టు మెయిన్ ఆఫీసులో ఒక చిన్న క్లాస్ - త్రీ ఉద్యోగం ఖాళీ వచ్చింది. అది బి.సి. వారికి కేటాయించింది. అందుచేత వెంకటేశ్వర్లు చేర్మన్ గారి భార్యను ఆశ్రయించి ఆ ఉద్యోగం తనకు వచ్చేటట్టుగా చేస్తే అంచెలంచెలుగా పైకి వచ్చి మీకు జన్మాంతం ఋణపడి ఉంటానన్నాడు.

కాని, ఉన్నతాధికారులలో చాలా మంది తమ పి.ఎ.ల నుండి ప్యూన్ల వరకూ ఎవరినీ ట్రాన్స్‌ఫర్ వంటి పద్ధతుల ద్వారా మార్చని వ్వరు. అలా వెంకటేశ్వర్లు ఆ ఉద్యోగం పొందలేకపోయాడు. అంతేకాక, చేర్మన్ గారికి ట్రాన్స్‌ఫర్ వచ్చి, కొత్తాయన వచ్చినప్పుడు ఆయనతో వెంకటేశ్వర్లు గురించి చాలా మంచి మాటలు చెప్పేడు. 'హి ఈస్ ఎ జెమ్ ఆఫ్ ఎ ధోబి. డు నాట్ రిస్క్ టు లీవ్ హిమ్' (వీడు నిపుణుడైన రజకుడు. ఇతన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వదులుకోవద్దు). అలా వెంకటేశ్వర్లు ఇంటర్ పాసైనా, గ్రాడ్యుయేట్ అయినా; బంగళాలో బట్టలు ఉతికేవాడిగానే స్థిరపడి పోయాడు తప్పా పై మెట్టుకి వెళ్లనే లేకపోయాడు.

ఇదంతా ఈ కథలో వినోద భరితంగా ఉందనే భ్రమ కలిగించే శైలిలో రాసిన విషాదాంత కథ.

అంటించి మడత పెట్టిన ఇండియా మేప్ తెచ్చేరండి. పాఠం అయిపోయాకండి. ఆ మేప్‌ని ఎప్పట్లాగ మడత పెట్టడం మాస్టారికి చేతకాలేదండి. మా క్లాసు లీడర్ సురేష్ ఆ మాప్ తీసుకుని ట్రై చేసేడండి. కాని మడత మరింత పాడైందే తప్పా అత నికీ చేతగాలేదండి. అప్పుడు మా మేష్టారేమో; "పిచ్చి వెధవల్లారా? మీకు చాతకా దర్రా ఆ పని. వెంకటాచలానికి ఇయ్యి; క్షణంలో మడత పెట్టేస్తాడు" అన్నారండి. నేను – అలాగే సార్ – అనే వరకు అందరూ నవ్వేరండి; ఆఖరికి సరిగ్గా మడత పెట్టేక కూడా నవ్వేరండి. అదుగో, అప్పుడు నిర్ణయించుకున్నాండి; ఈ జన్మలో చాకలి పని చెయ్యకూడదని!"

వెంకటాచలం చెప్పిన రెండు సంఘటనలూ నన్ను గాయపర్చిన మాట నిజమే. ఐనా సరే, అతని చిత్తశుద్ధిని ఫ్రాంక్‌నెస్‌నీ మెచ్చుకోకుండా ఉండలేక పోయాను. పైగా, వెంకటాచలం ఇంత పొగరు బోతుతనంగా నిర్భయంగా మాట్లాడినా అతని తండ్రి నారాయణ మీద నాకున్న సానుభూతి వెంకటాచలాన్ని క్షమించగల ఔన్నత్యం ఔదార్యం నాలో స్థిరపరిచింది. అందువల్ల; ఆ మరుసటి నెలలో వెంకటాచలానికి మరో ప్రభుత్వ కార్యాలయంలో ప్యూన్ పోస్టుకి ఇంటర్ వ్యూకి రమ్మని పిలుపు వచ్చినప్పుడు ఆ నియామకం చేసే అధికారి సలాహుద్దీన్ నా క్లాస్‌మేట్ అయి వుండడం వల్ల అతనితో గట్టిగా చెప్పి ఆ ప్యూన్ ఉద్యోగం వెంక టాచలానికి ఇప్పించగలిగేను.

ఈ నాలుగేళ్ళ పాటూ వెంకటాచలం సంగతి నేనట్టే పట్టించుకోలేదు. మేం చాలా దూరానికి ఇల్లు మారడం వల్ల చాకలి పనికి నారాయణకి బదులు మా కొత్త ఇంటికి దగ్గిరిగా ఉన్న సుబ్బయ్యని పెట్టుకున్నాం. ఎప్పుడైనా వెంకటాచలం గుర్తొస్తే అతగాడు ఇంటర్ పాసయేడు కనుక, చదువు మీద ఇంటరెస్టూ స్వయం కృషి మీద నమ్మకం ఉన్నవాడు కనకా డిగ్రీకి ప్రయివేటుగా చదివి, టైపూ, షార్టూ హేండూ నేర్చుకుని ఏ గుమస్తాగానో స్టెనోగ్రాఫర్ గానో అభివృద్ధి సాధించి ఉంటా డని ఊహిస్తూ వచ్చాను; మొన్న ఆదివారం అతగాడు నాకు పూర్ణా మార్కెట్ దగ్గిర కనబడేటంత వరకూనూ.

"బావున్నావా? ఉద్యోగంలో ఏమైనా అభివృద్ధి వచ్చిందా?" అని పరామర్శిం చాను.

"బాగులేనండి. ఉద్యోగం సంగతంటారా; మీరే గెల్చారండి" అన్నాడు వెంక టాచలం.

"నేను గెలవడమేమిటి. మధ్యని?" అన్నాను.

"అదంతేనండి. చాకలాడికి పుట్టినందుకు నేను చాకలిగానే బతకాలని మా నాన్నగారితో బాటుగా మీరుకూడా ఒకప్పుడు అనుకున్నారు కదండి! అందుకని మీరే గెల్చారంటున్నానండి".

"నువ్వు కోరిన ప్రకారం నీకు నేను ప్యూన్ ఉద్యోగం ఇప్పించేను కదా; మళ్ళీ ఇదేం మాట?" అన్నాను.

"అంతా అలా జరిగిపోయిందండి. సలాహుద్దీన్ గారున్న ఏడాది పాటూ ఏం మోశానో, కాగితాలు. ఆ తరువాత కాగితాల మోత పోయి బట్టల మోత తగిలి చాకలినై పోయానండి".

"అదెలా జరిగింది? తరవాతొచ్చినాయన నిన్నేమైనా డిస్మిస్ చేసేడా?"

"అలాచేసినా బాగుండేదేమో! కాని, సలాహుద్దీన్ గారి తరవాత వొచ్చిన రామ లింగస్వామి గారికి ఓ రోజు అర్జంటుగా చాకలి కావలసి వస్తే పోనీ కదా అని మా నాన్నగార్ని వప్పగించేనండి. నేను మా నాన్న గారి కొడుకునని తెలిసే వరకు డబ్బులిచ్చి చాకలి పని మా నాన్నగారికే ఇచ్చేరండి. ఆ తరువాత; ఒరే వెంకటా చలం; నువ్వు ఇవాళ నుంచి ఆఫీసుకు రాకు. బంగళాలోనే ఉండిపోయి ఏ రోజు బట్టలు ఆ రోజు ఉతికేసి ఇంటికి వెళ్ళిపో; నీకు ఆఫీసు వాళ్ళు నెల నెలా జీతం నీ కాళ్ళ దగ్గరికి పట్టుకొచ్చి ఇచ్చేసే ఏర్పాటు చేస్తాను. ఏముంది పెద్ద కష్టం! ఓవర్ హెడ్ టాంకులో సమృద్ధిగా నీళ్ళుంటాయి. సబ్బులు, సబ్బుగుండలు, సోడా గుండ, నీలిమందు, గంజి, ఏం కావలిసినా నీ చేతి డబ్బు నయాపైసా పడకుండా అన్నీ నేను ఏర్పాటు చేస్తాను. రోజు ఒక్క పూట పని చేస్తే చాలు? నెల జీతం పన్నెండు వందల రూపాయలూ నీకొచ్చేస్తుంది. పైగా నెలకో పది రోజులు నాతో బాటు నువ్వు కూడా టూర్లకి ఫాలో అయినట్టు రాసి నెలకి రెండు వందలు తక్కువ కాకుండా టిఏ కూడా ఇస్తాను; అన్నారండి. ఏదో, పెద్ద ఆఫీసర్‌గారు కదా అని మొహమాటపడి ఒప్పుకున్నందుకు చివరికి పర్మనెంటుగా చాకలినై పోయానండి. వారు ఒక్కపూట అన్నారు గానండి; ఉదయం ఉతుకుడు మధ్యాహ్నం ఇస్త్రీ – ఇలాగ రెండు పూటలా పనొచ్చి నా నెత్తిమీద పడ్డాదండి. రామలింగస్వామిగారు ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతూ తన దగ్గిర ఛార్జి తీసుకున్న సుబ్బరామ శాస్త్రి గారికి చెప్పే శారండి – "దిస్ వెంకటాచలమ్ ఈజ్ ఏ జెమ్ ఆఫ్ ఏ దోభీ, ఇతన్ని ఆఫీసుకు మాత్రం మార్చకు" అని! అలాగలాగ చాకలాణ్ణే అయిపోయానండి. మా ఆఫీ సులో ధర్మయ్య అని ఒకడున్నాడండి. వాళ్ళకి తండ్రి తాతల కాలం నుంచీ చెప్పులు కుట్టే బిజినెస్సండి. అలాగే గంగయ్య ఉన్నాడండి. వాళ్ళకి లక్ష్మీటాకీసు దగ్గిర ఒక సెలూన్, అదికాక శ్రీనివాసకళ్యాణ మండపాన్ని అనుసరించి మేళం ఉన్నాయండి. ఐనా వాళ్ళిద్దర్నీ ఆ పన్ల కోసం పిలవడానికి ధైర్యంలేని మా అధికార్లకి నా మీద మాత్రం గొప్ప అభిమానం సార్".

"గుమస్తా పోస్టు ఏదైనా ఖాళీ వస్తే దరఖాస్తు పెట్టుకో. కొంచెం సర్వీసు అయింది కనకాను, ఏదో ఇంటర్ దాకా చదివేవు కనకాను నీకు ఇస్తారేమో. ఆ తరు వాత నువ్వు గుమస్తానై పోతే చూస్తూ చూస్తూ నిన్ను బట్టలుతకడానికి పిలవరు కదా" అని ధైర్యం చెప్పబోయేను.

"ఆ సరదా కూడా తీరిపోయిందండి, కిందటి నెల్లో రెండు పోస్టులొచ్చేయండి అందులో ఒకటి బి.సి.కి రిజర్వేషన్ కూడానండి, అందుకనండి; దినం తప్పక వారి మురికి అంతా వదల గొడుతున్నాను కదా; నా మురికి బతుకు తెల్లార్చకపోతారా, నాకో పోస్టు ఇయక్కపోతారా అని అయ్యగార్తోను అమ్మగార్తోనూ కూడా చెప్పుకు న్నానండి. కానీ నేను తప్పుకుంటే బట్టలుతకడానికి వేరే మనిషిని పెట్టుకోడం; దానికి చేతిడబ్బు కర్చవడం ఒకటీని; పైగా బట్టలు చిరగడం, మారిగిళ్ళయిపోడం లాంటి రిస్కులొకటీనీ! అందుకని నా కింకొక రాత లేదనుకుంటానండి".

"పోనీ ఒకలా చెయ్యి, బట్టలుతికేటప్పుడు కొంచెం మోటుతనం ఉపయోగించీ, కాస్త బ్లీచింగు పొడరు తగిలించీ; ఇస్త్రీ చేసేటప్పుడు మరి కొంచెం హీటు పెంచీ నీ నైపుణ్యం చూపిస్తే ఏమైనా మార్పుకి అవకాశం ఉండొచ్చేమో?"

"సారీ సార్, నా స్వభావంలో ఉన్న బేసిక్ మోరల్ నన్ను అలా చెయ్యనివ్వ దండి".

"సరే: నా కర్జంటు పనుంది; నేను వెళ్తాను. ఎప్పుడైనా కనిపిస్తూ ఉండు, మా పిల్లలందరికీ నువ్వంటే ఆపేక్ష, నీకు తెలుసుకదా! మీ నాన్నని అడిగేనని చెప్పు" అని వెంకటాచలాన్ని అక్కడితో వదిలేశాను.

*(ఉదయం వీక్లీ 1990 ఉగాది సంచిక)*

*

## కడు లబ్ధీగా రాస్తారు

భమిడిపాటి రామగోపాలం కథలు నేతి గారెల్లా ఉంటాయని నా కంటె పెద్దవారే అనగా విన్నాను. ఆఫీస్ లైఫ్‌కీ, హౌస్‌లైఫ్‌కీ తూకం కుదరనపుడు పుట్టే సంసార పక్షం కథలు యీ రచయిత కడు లబ్ధీగా రాస్తారు. హ్యూమర్నీ పాథోస్‌నీ రంగరించి పోయడంలో రామగోపాలం కథలు ఆ రామగోపాలాలు!

– పురాణం సుబ్రహ్మణ్యం శర్మ

## కథల్ని రమ్యుగా, లబ్జుగా చెబుతాడు

రామగోపాలం కథలు చదువుతుంటే వెన్నెలనీడలో కూర్చుని సర్దాగా కబుర్లు చెప్పుకుంటున్నట్టు ఉంటుంది. ఆయన కథ చెప్పడం రమ్యుగానూ, లబ్జుగానూ ఉంటుంది. ఆయన కథలన్నీ మధ్యతరగతి సంసారాల కష్టసు ఖాలకు సంబంధించినవి. చంద్రుడి మీదికి పాకిన మబ్బుతునక వచ్చి కాసేపు ఆగి వెళ్లిపోయినట్లు ఉంటాయవి.

– నండూరి రామమోహనరావు


చిరునామా :

భమిడిపాటి రామగోపాలం

1- అర్జున అపార్ట్‌మెంట్స్, కృష్ణాకాలేజ్ దగ్గర,

ఇసుకతోట, విశాఖపట్నం – 530022

ఫోన్ నెం: 0891 - 2535550